పత్రికాప్రకటన కాకినాడ, డిశంబర్ 27, 2018.

**సాంకేతిక రంగంలో వినూత్న ప్రయోగాలు రావాలి.**

**జె.ఎన్.టి.యు. టెక్నో ఫెయిర్ లో కలక్టర్ కార్తికేయ మిశ్రా.**

సాంకేతిక రంగంలో వినూత్నమైన ఆలోచనల ద్వారా క్రొత్త ప్రోజెక్టులకు నాంది పలకాలని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా సూచించారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియులో రెండు రోజుల పాటు జరిగే నేషనల్ ఇనీషియేటివ్ ఫర్ డిజైన్ ఇన్నోవేషన్ పై జరిగే టెక్నోఫెయిర్‌లో గురువారం కలక్టర్ కార్తికేయ మిశ్రా ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ కాకినాడలోని జెఎన్‌టియు-కె విశ్వవిద్యాలయం రాష్ట్రంలో ఉత్తమమైన విశ్వవిద్యాలయంగా పేరొందిందని ఇటువంటి విద్యా సంస్థలోని ఇంజనీరింగ్ విద్యార్ధులు కొత్త ప్రోజెక్టుల ద్వారా నూతన ఒరవడిని సృష్టించాలన్నారు. జె.ఎన్.టి.యు. కాకినాడకు మౌలిక సదుపాయాలు, ఉత్తమ అధ్యాపకులు అందుబాటులో వున్నారని ఈ వనరులను వినియోగించుకొని విద్యార్ధులు పరిశోధన వైపు తమ దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఇంజనీరింగ్ విద్యార్ధులు తమ ప్రోజెక్టులను కేవలం విద్యాపరమైన అర్హతను పొందడానికి కాకుండా తమ ప్రోజెక్టుల ద్వారా సమాజానికి మేలు జరిగే విధంగా క్రొత్తదనం వుండాలని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో వున్న టెక్నాలజీ ల్యాబ్‌లో కూడా మార్పులు తీసుకురావల్సిన అవసరం వుందని, కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటైనఈ ల్యాబ్‌లలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరమైన సదుపాయాలను కల్పించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు, కాకినాడలో ఫెబ్‌ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వైస్ ఛాన్సలర్‌కు సూచించారు. దీని ద్వారా స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధనలు జరపడానికి వీలవుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు-కె వైస్ ఛాన్సిలర్ ప్రొ॥ యం.రామలింగరాజు, రిజిస్ట్రార్ వివి సుబ్బారావు, ప్రొఫెసర్లు ఎ.గోపాలకృష్ణ, ఐ.శాంతి ప్రభ, వి.రవీంద్రనాధ్, తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )